క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి సన్మానం



వాజేడు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జీవ శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బొగ్గం కుమార్‌బాబును శుక్రవారం ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సన్మానించారు. జిల్లాలో నిర్వహించిన 52వ సైన్స్ ఫెయిర్‌లో పాఠశాలకు చెందిన మహేశ్ అనే విద్యార్థి విపత్తు నిర్వహణ అనే అంశం (జూనియర్) విభాగంలో మొదటి బహుమతిని గెలుచుకున్నాడు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపికయ్యాడు. మహేశ్‌కు బొగ్గం కుమార్‌బాబు గైడ్‌గా వ్యవహరించి ములుగులో మొదటి బహుమతి గెలుచుకోవడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడానికి సలహాలు సూచనలు చేశారు. దీంతో ఉపాధ్యాయుడిని సన్మానించినట్లు ఎంఈఓ తెలిపారు.

రాంబాబుకు..

ఏటూరునాగారం: కన్నాయిగూడెం మండలం ఏటూరు గ్రామానికి చెందిన గోస్కుల రాంబాబును మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం సన్మానించారు. రాంబాబు ఈనెల 8న ఢిల్లీలో భారతీయదళిత సాహిత్య అకాడమీ వారి నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డును అందుకున్నాడు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన మాల మహానాడు సంఘ నాయకులు రాంబాబును సన్మానించి సంఘంబలోపేతానికి కృషి చేస్తూ సామాజిక సేవలో రాణిస్తూ అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. నాయకులు మాదారి రామయ్య, వేల్పుల సమ్మక్క, మాదారి రాంబాబు, రామకృష్ణ, జూపాక అర్జున్, పెయ్యల రాకేష్, చిక్కుల వినోద్, గద్దల ప్రణయ్ పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



సుదేశ్‌రావు, అధ్యక్షుడు



రాజేశ్, ప్రధాన కార్యదర్శి

వాజేడు: టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కమిటీని శుక్రవారం జిల్లా అధ్యక్షుడు పాడెం సమ్మయ్య, కార్యదర్శి కొండ చెంచయ్య సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వాసం సుదేశ్‌రావు, ప్రధాన కార్యదర్శిగా సిందే రాజేశ్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, గొంది లక్ష్మి, కోశాధికారిగా బొగ్గం కుమార్, కార్యదర్శులుగా కృష్ణయ్య, నర్సింగరావు, ఎస్ చంద్రకళ, వెంకటరమణ, సంతోష్, నాగార్జున, ప్రేమ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నియామకం

ఏటూరునాగారం: తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ ఫెడరేషన్ మండల అధ్యక్షుడిగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న బి.రాజు నియమించినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల ఉప్పస్వామి, పల్లె నాగరాజు, హాట్కార్ సమ్మయ్యలకు రాజు కృతజ్ఞతలు తెలిపారు.

గుంతల పూడ్చివేత

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి బస్‌షెల్టర్ వద్ద వర్షాకాలంలో ధ్వంసమైన రోడ్డుతో వాహనారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్పందించిన ఎస్సై గోగికారి ప్రసాద్ శుక్రవారం మొరంతో గుంతలను పూడ్చివేయించారు. ఈ సందర్భంగా మొరం తరలింపునకు సహకరించిన దాసారపు భాస్కర్, నల్లబెల్లి మొండయ్యలను ఎస్సై అభినందించారు. గుంతలను పూడ్చివేయుటకు కృషి చేసిన ఎస్సైకి గ్రామస్తులు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కాటారం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని విలాసాగర్–గుమ్మాళ్లపల్లి రహదారిపై ధర్మసాగర్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం మండలం అంకుషాపూర్‌కు చెందిన అయిలి శ్రీనివాస్ ధర్మాసాగర్‌లోని బంధువుల ఇంట్లో దశదినకర్మకు హాజరయ్యాడు. ఇంటికి తిరుగు ప్రయాణంలో తన బంధువైన బొమ్మాపూర్‌కు చెందిన లక్ష్మి అనే మహిళను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని గుమ్మాళ్లపల్లి వైపుగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో మలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి ఎదురుగా వచ్చి బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. దీంతో శ్రీనివాస్ రోడ్డుపై పడిపోవడంతో తలకు, శరీర భాగాల్లో తీవ్రగాయాలయ్యాయి. లక్ష్మికి సైతం కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. ట్రాక్టర్ రోడ్డు పక్కకు దూసుకుపోయి బోల్తాపడింది. డ్రైవర్‌కు సైతం గాయాలైనట్లు తెలిసింది. క్షతగాత్రులను 108 ద్వారా చికిత్స నిమిత్తం భూపాలపల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ పరిస్థితి విషమయంగా ఉన్నట్లు సమాచారం. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

వసతులు కరువు

కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడుతున్న రైతులు

- పట్టించుకోని అధికారులు



ట్రాక్టర్ సాయంతో ధాన్యం తూర్పార పోస్తున్న రైతులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు సమీపంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కనీస వసతులు లేవు. తాగు నీరు, విద్యుత్ సౌకర్యం, నీడ కోసం టెంట్ కూడా నిర్వాహకులు ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సౌకర్యం లేకపోవటంతో రాత్రి కొనుగోలు కేంద్రాల వద్ద ఉండాలంటే భయపడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్యాడీ క్లీనర్ (తూర్పార యంత్రం) సక్రమంగా చేయడం లేదు. కాగా, విద్యుత్ సౌకర్యం లేకపోడంతో నిరుపయోగంగా ఉంది. దీంతో ట్రాక్టర్ల సాయంతో ధాన్యాన్ని తూర్పార పడుతున్నారు. నీడ కోసం టెంట్ సౌకర్యం లేక చెట్టు కిందనే ఉండాల్సి వస్తుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇబ్బందులు పడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఇప్పటికైన స్పందించి సౌకర్యాలకు కల్పించాలని రైతులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న తూర్పార పట్టే యంత్రం



టెంట్ లేక పోవటంతో చెట్టు కింద కూర్చున్న రైతులు

ప్యాడీ క్లీనర్ పని చేయటం లేదు



కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న ప్యాడీ కీనర్ పని చేయటం లేదు. దీంతో ట్రాక్టర్ల సాయంతో ధాన్యాన్ని తూర్పార పట్టుకుంటున్నాం. ఇప్పటికైన అధికారులు తూర్పాల యంత్రాలు పనిచేసేలా చర్యలు చేపట్టాలి.

– నర్సింహారావు, రైతు, వెంకటాపురం

సౌకర్యాలు కల్పించాలి



కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కావాల్సిన కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలి. అధికారులు ఇప్పటికై న స్పందించి తాగు నీరు, విద్యుత్, టెంట్ సౌకర్యం కల్పించాలి.

– శ్రీను, రైతు, వెంకటాపురం

ఇంధన పొదుపునకు పాటుపడాలి

- తహసీల్దార్ రవీందర్



బహుమతిని అందజేస్తున్న సాంబశివరెడ్డి

మంగపేట: ఇంధన వనరుల పరిరక్షణ, పొదుపు కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని తహసీల్దార్ రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వికాస్ అగ్రీ ఫౌండేషన్, జాతీయ మిర్చీ టాస్క్ ఫోర్స్ మెంబర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు ఇంధన పొదుపుపై అవగాహన విజ్ఞానాన్ని పెంపొందించుకుని ఇంధన వనరులను పొదుపు చేసి భావితరాలకు బహుమానంగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విరేందర్, ఎస్సై సురేష్‌కుమార్, ఎన్‌పీడీసీఎల్ ఏఈ శర్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పలిమెల: మండలంలోని పలిమెల కేజీబీవీలో ఖాళీగా ఉన్న ఆరు నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లీష్, హిందీ సబ్జెక్టులు బోధించేందుకు తాత్కాలిక అతిథి అధ్యాపకులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి ఎం.భవాని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ, బీఈడీ పూర్తి చేసి టెట్ అర్హత గల మహిళలు, పీజీసీఆర్‌టీ నర్సింగ్ ఇంటర్మీడియేట్ బోధించుటకు బీఎస్సీ నర్సింగ్ అర్హత గల మహిళలు ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు పలిమెల కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గెస్ట్ ఫ్యాకల్టీ కాల వ్యవధి మూడు నెలలు మాత్రమేనని పేర్కొన్నారు.

పాఠశాలలో వైద్యశిబిరం

కాళేశ్వరం: కాళేశ్వరం గిరిజన ఆశ్రమ పాఠశాలలో సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షల వైద్య శిబిరం కాళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుస్మిత నిర్వహించారు. సికిల్ సెల్ వ్యాధి గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత, హ్యాండ్ వాష్ టెక్నిక్స్, గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమ్య, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు



అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌ఎస్‌ఓ మల్ల నాగమణి

- ఎఫ్‌ఎస్‌ఓ మల్ల నాగమణి

వాజేడు: అడవికి నిప్పు పెట్టడం మానవాళికి ముప్పని ఎఫ్‌ఎస్‌ఓ మల్ల నాగమణి అన్నారు. శుక్రవారం ఏడ్జర్లపల్లి గ్రామంలో అటవీశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మల్ల నాగమణి మాట్లాడుతూ.. అడవులను రక్షించుకోవడం అందరి బాధ్యత అన్నారు. అడవులు కాలిపోతే స్వచ్ఛమైన ఆక్సిజన్ అందకపోగా సకాలంలో వర్షాలు పడక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. బీట్ ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, సరోజ, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ వ్రతం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీభక్తాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం హనుమాన్ వ్రతాన్ని ఆలయ ఈఓ మహేశ్ ఆధ్వర్యంలో పూజారులు రాధాకృష్ణ, మురళికృష్ణామాచార్యులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలో పాల్గొన్నారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కార్మికుల రక్షణలో భాగస్వాములు కావాలి

- డైరెక్టర్ ఆఫ్ ఓపీ జీఎం వెంకటేశ్వర్‌రావు



ఓపెన్‌కాస్ట్ మైన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మల్హర్: ఓపెన్ కాస్ట్‌లో ఉద్యోగులు, కార్మికులు రక్షణలో భాగస్వాములు కావాలని డైరెక్టర్ ఆఫ్ ఓపీ జీఎం వెంకటేశ్వర్‌రావు సూచించారు. 55వ రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలో తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ మైన్‌ను వెంకట్వేర్‌రావు సందర్శించి, రక్షణ ఏర్పాట్లు పరిశీలించారు. మైన్‌లో కొనసాగుతున్న సేఫ్టీపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఉద్యోగి విధి నిర్వహణలో రక్షణ సూత్రాలు పాటించాలని సూచించారు. కార్మికులకు రక్షణపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని పేర్కొన్నారు. 2023 వార్షిక సంవత్సరానికి సంబంధించిన సేఫ్టీ అవార్డును ఏఎమ్మార్ అధికారులకు అందించారు. అనంతరం ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ట్రేడ్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో సీఈ(కోల్, కమర్షియల్) జీవన్‌కుమార్, ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్, సీనియర్ జనరల్ మేనేజర్ కేఎస్ మూర్తి, మైన్ మేనేజర్ శ్రీనివాస్, సేఫ్టీ అధికారి సురేష్‌బాబు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మండలశాఖ ఆధ్వర్యంలో ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఏబీవీపీ నగర కార్యదర్శి పేట సాయి మాట్లాడుతూ.. 75 సంవత్సరాలుగా ఏబీవీపీ విద్యార్థుల కోసం విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తుందన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి నింపుతూ జాతీయవాదులుగా తయారు చేస్తూ, సామాజిక సేవలు అందిస్తుందన్నారు. సిద్దిపేటలో ఈ నెల 23, 24, 25 నిర్వహించే రాష్ట్ర మహాసభల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో. సంజయ్, సాయికిరణ్, ప్రకాశ్, వరుణ్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నుంచి నలుగురి బహిష్కరణ

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాంబశివరావు



మాట్లాడుతున్న సాంబశివరావు

వెంకటాపురం(కె): ఇటీవల కాంగ్రెస్‌లోకి వచ్చి పార్టీకి సంబంధం లేకుండా ప్రజలల్లో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పి ప్రలోబాలకు గురి చేస్తున్న నలుగురిని పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిడెం సాంబశివరావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పార్టీ ఆదేశాల మేరకు పార్టీ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా కిరణ్ వర్మచ, దేవస హాయం, రమేశ్, నానిలను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, రమేశ్, బాలసాని వేణు, నాగేశ్వరావు, సాయి తదితరులు ఉన్నారు.

అన్నదానం

కాటారం: మండల కేంద్రంలోని శ్రీ ఆనంద ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారణ భక్తులకు అన్నదాన కార్యక్రమం కొనసాగుతుంది. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ హర్షిత డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ మచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. అన్నదాత దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు బచ్చు అశోక్‌గుప్త, గురుస్వాములు జక్కు మొగిలి, అయిత వెంకన్న, పెండ్యాల రంజిత్, చీమల రాజు, గంగిరెడ్డి లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

మల్హర్: వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మండల వైద్యాధికారి వినయ్‌భాస్కర్ అన్నారు. మండలంలోని తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం సూపర్‌వైజర్లు, సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి రోగులను గుర్తించి వైద్య సేవలందించాలన్నార. గర్భిణుల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని, పిల్లలందరికీ సరైన సమయంలో టీకాలను వేయాలని సూచించారు. విష జ్వరాలను అరికట్టేందుకు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి జ్వర పీడితుల నుంచి రక్తనమూనాలు సేకరించాలని సూచించారు. అనంతరం నూతనంగా విధుల్లో చేరిన డాక్టర్ వినయ్ భాస్కర్‌ను సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజు, సూపర్ వైజర్స్, ఏఎన్ఎంలు, ఆశాలు, సిబ్బంది పాల్గొన్నారు.

తరుగులేకుండా కొనుగోలు చేయాలి

- బీఆర్‌ఎస్ నాయకుడు గోవింద్‌నాయక్



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ములుగు రూరల్: రైతులు పండించిన ధాన్యం ప్రభుత్వం తరుగు లేకుండా కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నాయకుడు పోరిక గోవింద్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని జగ్గన్నపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గింజను, తడిసిన ధాన్యం కోతలు లేకుండా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందని అన్నారు. బోనస్ ప్రకటించి కొంతమందికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటుదని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యం అమ్ముకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్, సానికొమ్ము ఆదిరెడ్డి, గడ్డమీది భాస్కర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

సీతక్క కృషితో సెంట్రల్ లైటింగ్

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘు



సెంట్రల్ లైటింగ్ కోసం పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌కు పంచాయతీరాజ్ శాఖ నుంచి మంత్రి సీతక్క కృషితో రూ.80లక్షల నిధులు వచ్చాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని సెంట్రల్ సిస్టమ్ మార్కింగ్‌ను పంచాయతీరాజ్ ఎస్ఈ అజయ్‌కుమార్, డీఈఈ నరేష్ సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ కోసం మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న ఆధ్వర్యంలో పనులు చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. మండల కేంద్రంలో వై జంక్షన్ నుంచి చేపల మార్కెట్ వరకు సదరు కాంట్రాక్టర్, అధికారులు పరిశీలించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి ఎండీ గౌస్ పాషా, కన్నాయిగూడెం మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు, కందుకూరి రతన్, జిల్లా, మండల, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం



కంకర తేలిన రోడ్డు చూపుతున్న అమ్జద్‌పాషా

- సీపీఐ జిల్లా నాయకుడు అమ్జద్‌పాషా

ములుగు రూరల్: ములుగు నుంచి దేవగిరిపట్నం వెళ్లె రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా చేసి వదిలేశారని సీపీఐ జిల్లా నాయకుడు అమ్జద్‌పాషా అన్నారు. శుక్రవారం కంకర పోసి వదిలేసిన రోడ్డును ఆయన పరిశీలించి మాట్లాడారు. ములుగు నుంచి దేవగిరిపట్నం వరకు నిర్మాణం చేపట్టవలసిన రోడ్డు పనులను కాంట్రాక్టర్ మధ్యంతరంగా నిలిపివేశారని అన్నారు. కంకర పోసి వదిలేయడం వల్ల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మదార్, సుబ్బారెడ్డి, స్వామి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల కోసం పోరాటం

- సీపీఐ జిల్లా కార్యదర్శి మల్లికార్జునరావు



సభ్యత్వం అందజేస్తున్న మల్లికార్జునరావు

వాజేడు: సీపీఐ బలహీన వర్గాల కోసం పోరాటం చేస్తూనే ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లికార్జునరావు అన్నారు. మండల పరిధిలోని ధర్మవరం, చంద్రుపట్ల గ్రామాల్లో శుక్రవారం ఆయన కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. కర్షక, కార్మిక, శ్రామికుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన పార్టీ భారత కమ్యూనిస్టు అన్నారు. సీపీఐ ఆవిర్భవించి డిసెంబర్ 26 నాటికి 100వ సంవత్సరంలోకి అడుగు పెడుతుందని ప్రతీ కార్య కర్త గ్రామ గ్రామాన సంబురాలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురికి పార్టీ సభ్యత్వాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రాంబాబు, వెంకటేశ్వర్లు, శ్రీను, నర్సింహరావు, మణికంఠ, సంతోశ్ తదితరులు ఉన్నారు.

19న మహా పడిపూజోత్సవం



పడిపూజ కార్యక్రమ స్థలాన్ని పరిశీలిస్తున్న రమేశ్

ములుగు రూరల్: అయ్యప్ప స్వామి 18 కలిశాల మహా పడిపూజోత్సవ కార్యక్రమం ఈ నెల 19న జిల్లా కేంద్రంలోని రామాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు అయ్యప్ప భక్తమండలి అధ్యక్షుడు గురుస్వామి రమేశ్ తెలిపారు. శుక్రవారం రామాలయ ఆవరణలో అయ్యప్ప స్వాములతో సమావేశం నిర్వహించి పడిపూజ కార్యక్రమ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 10.30 నిమిషాలకు హరిహర క్షేత్ర ప్రధాన అర్చకుడు గురుస్వామి దేవేశమిశ్రా చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 7 గంటలకు నగర సంకీర్తన, ఉదయం 10.30 పడి పూజ, 12 గంటలకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అయ్యప్ప మాలధారణ స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. కార్యక్రమంలో భక్తమండలి గౌరవ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సల్వాల శ్రీనివాస్, భక్తమండలి ప్రధాన కార్యదర్శి విగ్నేశ్వర స్వామి, ఉపాధ్యక్షుడు పొడాల ఓంప్రకాశ్ గురుస్వామి, కవిరాజు, రాకేష్‌రెడ్డి, శ్రీనాథెడ్డి, చందర్, రవిందర్, రాకేష్‌యాదవ్, కుమార్, జ్జల కుమార్, సుధాకర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

టేకుమట్ల: మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో వాహన తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించి మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే గ్రామాల్లోకి ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. నేర నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.